
సాక్షి
వికారాబాద్
గురువారం । 2 । మార్చి । 2023



వంతెన.. ఇంతేనా..?
తాండూరు-సంగారెడ్డి ప్రధాన రహదారిపై గాజీపూర్ వద్ద నిర్మిస్తున్న వంతెన పనులు మూడేళ్లుగా పెండింగ్‌లో ఉన్నాయి. 8లో▸



అంగన్‌వాడీల సమ్మె
సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అంగన్‌వాడీ వాడీ కార్యకర్తలు సమ్మె బాట పట్టారు. 8లో▸



క్రీడలకు అధిక ప్రాధాన్యత
క్రీడలకు రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని తాండూరు ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డి అన్నారు. 9లో▸

న్యూస్‌రీల్

అంగన్‌వాడీ కేంద్రాల ఎత్తివేతకు కేంద్రం కుట్ర

అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు నర్సమ్మ



దీక్షలో కూర్చున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

పరిగి: అంగన్‌వాడీ వ్యవస్థను నిర్వీర్యం చేసి ఎత్తివేతకు కేంద్ర ప్రభుత్వం కుట్ర చేస్తోందని అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు నర్సమ్మ పేర్కొన్నారు. బుధవారం పరిగిలోని కొడంగల్ చౌరస్తా నుంచి బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం దీక్షా శిబిరానికి చేరుకొని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కేంద్ర బడ్జెట్‌లో అంగన్‌వాడీ సెంటర్లకు నిధులు తగ్గించడం సరికాదన్నారు. ప్రజలకు విస్తృత సేవలు అందిస్తున్న ఐసీడీఎస్ వ్యవస్థను పటిష్ట పరచాలని డిమాండ్ చేశారు. అలాగే ఐసీడీఎస్‌ను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి రామకృష్ణ, ఉపాధ్యక్షుడు చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

రైతుల ఖాతాలు హోల్డ్ చేయడం సరికాదు

సీపీఎం జిల్లా కార్యదర్శి వెంకటయ్య




బ్యాంక్ మేనేజర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

పరిగి: పంట రుణాల వసూలు పేరిట బ్యాంకర్లు రైతుల ఖాతాల నుంచి డబ్బులు తీసుకోవడం సరికాదని సీపీఎం జిల్లా కార్యదర్శి వెంకటయ్య అన్నారు. బుధవారం ఈ విషయమై పట్టణంలోని ఎస్‌బీఐ(ఏడీబీ) మేనేజర్ రాజ్‌కుమార్‌ను కలసి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం రైతు రుణమాఫీ చేయకుండా కాలయాపన చేస్తోందని ఆరోపించారు. నాలుగేళ్ల నుంచి రైతులను మభ్యపెడుతోందన్నారు. బ్యాంకర్లు మాత్రం పంట రుణాలు పొందిన వారిని అన్ని విధాలా ఇబ్బందులకు గురిచేస్తున్నారని పేర్కొన్నారు. ఇది సరైన పద్ధతి కాదని, ఖాతాల్లో దాచుకున్న డబ్బులను అధికారులు హోల్డ్‌లో పెడుతున్నారని తెలిపారు. దీంతో డబ్బులు డ్రా చేసుకోలేక అన్నదాతలు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు హబీబ్, సత్తయ్య, రఘురాం, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

చెన్నకేశవరెడ్డిని గెలిపించుకుందాం

పీఆర్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కమలాకర్



సమావేశంలో మాట్లాడుతున్న కమలాకర్

కొడంగల్ రూరల్: ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా పీఆర్‌టీయూ బలపరిచిన చెన్నకేశవరెడ్డిని గెలిపించుకుందామని ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బీరెల్లి కమలాకర్ పిలుపునిచ్చారు. బుధవారం మండలంలోని పలు ఉన్నత పాఠశాలలు, కేజీబీవీ, జూనియర్ కళాశాలల్లో ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించేందుకు పీఆర్‌టీయూ తీవ్ర కృషి చేస్తోందన్నారు. 317 జీవో ద్వారా తమ స్థానికతను కోల్పోయిన ఉపాధ్యాయులకు వచ్చే రెండేళ్లలో తిరిగి వారి స్థానిక జిల్లాకు పంపించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. పండిత్, పీఈటీల పదోన్నతుల విషయంలో వారంలో తీపి కబురు వింటామని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి అమర్‌నాథ్ పాల్గొన్నారు.

సామాన్యుల నడ్డి విరుస్తున్న కేంద్రం

అనంతగిరి: రోజురోజుకూ నిత్యావసర సరుకుల ధరలు పెంచుతూ కేంద్ర ప్రభుత్వం సామాన్యుల నడ్డి విరుస్తోందని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ బుధవారం ఒక ప్రకటనలో ఆరోపించారు. ప్రజావ్యతిరేక విధానాలు అవలంబించడం తోపాటు, వంటగ్యాస్, నిత్యావసర సరుకులు కొనాలంటే ముచ్చెమటలు పడుతున్నాయని తెలిపారు. బీజేపీ పాలనలో అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నా రని ఆవేదన వ్యక్తం చేశారు. పెంచిన రేట్లను వెంటనే తగ్గించాలని ఆయన కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ఆత్మవిశ్వాసం పెంచాలి

- ఉపాధ్యాయులకు కలెక్టర్ నారాయణరెడ్డి ఆదేశం



సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

వికారాబాద్ అర్బన్: పిల్లల్లో కష్టపడే తత్వాన్ని పెంపొందిస్తూ వారిలో ఆత్మవిశ్వాసం పెంచుతూ పరీక్షలకు సిద్ధం చేయాలని కలెక్టర్ నారాయణరెడ్డి ఉపాధ్యాయులకు సూచించారు. 10వ తరగతి పరీక్షల నిర్వహణ, ప్రీ ప్రైమరీ పోస్ట్ మెట్రిక్ స్కాలర్ షిప్‌ల పెండింగ్‌పై విద్యాశాఖ, షెడ్యూల్డ్ కులాల సంక్షేమ శాఖ అధికారులతో బుధవారం కలెక్టరేట్‌లో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఏప్రిల్ 3వ తేదీ నుంచి జరగనున్న 10వ తరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం సమకూర్చిన అభ్యాస దీపిక పుస్తకాలు అందజేసి పరీక్షలకు సన్నద్ధం చేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలపై ప్రజలకు నమ్మకం కలిగేలా బోధన ఉండాలన్నారు. విలువలతో కూడిన విద్యను అందించాలని సూచించారు. పిల్లలకు పెట్టే మధ్యాహ్న భోజన విషయంలో రాజీ పడొద్దన్నారు. ఈ విషయంలో ఏమాత్రం నిర్లక్ష్యం చేసినా చర్యలు తప్పవని హెచ్చరించారు. జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ప్రీ మెట్రిక్, పోస్ట్ మెట్రిక్ స్కాలర్ షిప్‌లపై ప్రత్యేక దృష్టి సారించి, వారం రోజుల్లో పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు.

మొక్కలు ఎండితే చర్యలు



సిరిగిరిపేట్ నర్సరీని పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్ రాహుల్ శర్మ

- అడిషనల్ కలెక్టర్ రాహుల్‌శర్మ
- అల్లాపూర, సిరిగిరిపేట్ నర్సరీల పరిశీలన

తాండూరు రూరల్: గ్రామాల్లోని వన నర్సరీల్లో మొక్కలు ఎండితే సంబంధిత శాఖ అధికారులపై చర్యలు తప్పవని అడిషనల్ కలెక్టర్ రాహుల్ శర్మ హెచ్చరించారు. బుధవారం మండలంలోని సిరిగిరిపేట్, అల్లాపూర్ గ్రామ శివారుల్లోని వన నర్సరీలు, డంపింగ్ యార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..గ్రామాల్లో నిత్యం పారిశుద్ధ్య పనులు నిర్వహించాలన్నారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు ఉంటాయన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌గా ఉన్న సమయంలో 2007- 08 సంవత్సరంలో తాండూరు మండలం సిరిగిరిపేట్ సర్వే నంబర్ 109లో 26 ఎకరాల ప్రభుత్వ భూమిని రాజీవ్ స్వగృహ నిర్మాణాల కోసం కేటాయించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆ భూములను అడిషనల్ కలెక్టర్ పరిశీలించారు. ఇందుకు సంబంధించిన నివేదికను కలెక్టర్‌కు అందజేస్తామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీఓ అశోక్‌కుమార్, తహసీల్దార్ చిన్నప్పల నాయుడు, ఎంపీఓ రతన్‌సింగ్, ఏపీఓ నరోత్తంరెడ్డి, అల్లాపూర్ సర్పంచ్ నందినిగౌడ్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

మొక్కలు ఎండొద్దు

యాలాల: వేసవి ప్రారంభమైనందున వన నర్సరీల్లో మొక్కలు చనిపోకుండా చూడాలని అడిషనల్ కలెక్టర్ రాహుల్ శర్మ ఆదేశించారు. బుధవారం మండలంలోని కోకట్ గ్రామ వన నర్సరీ తోపాటు పల్లె ప్రకృతి వనాన్ని పరిశీలించారు. నర్సరీలో ఆశించిన స్థాయిలో మొక్కలు ఎదగకపోవడంతో అసంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ పుష్పలీల, పంచాయతీ కార్యదర్శి సుధాకర్, ఈసీ శ్రావణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రీయ కళలకు నూతనత్వం తోడవ్వాలి

సినీ గేయ రచయిత సుద్దాల అశోక్‌తేజ

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: శాస్త్రీయ కళలను కాపాడుతూ వాటి వైభవాన్ని ముందు తరాలకు కొత్తదనంతో అందించే ప్రయత్నం చేస్తున్నామని ప్రముఖ సినీ గేయ రచయిత సుద్దాల అశోక్ తేజ పేర్కొన్నారు. బుధవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ ప్రజాసాంస్కృతిక కేంద్రం ఆధ్వర్యంలో భూపతి వెంకటేశ్వర్లు అధ్యక్షతన శాస్త్రీయ నృత్య గురువుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాబోయే రోజుల్లో శాస్త్రీయ నృత్య సంగీతాన్ని తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో విశ్వవిద్యాలయాల్లో కూడా పరిచయం చేసే విధంగా ప్రణాళిక రూపొందిస్తున్నామన్నారు. కళాభిమానుల సహకారంతో నిత్య ప్రక్రియలో నూతనత్వాన్ని తీసుకురావడానికి కృషి చేస్తామన్నారు. శ్రీశ్రీ,, గుర్రం జాషువా, గురజాడ దేశభక్తి, అభ్యుదయ గేయాలకు శాస్త్రీయ నృత్యాలను జోడించి కళలను ప్రజలకు మరింత చేరువ చేయడమే ప్రధాన లక్ష్యమన్నారు.

సస్యరక్షణలో ఆధునిక పద్ధతులు మేలు

తాండూరు వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ సుధారాణి



ఆధునిక వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

తాండూరు: డ్రోన్ ద్వారా పంటల సస్యరక్షణ చేపడితే రైతులకు ప్రయోజనం చేకూరుతుందని తాండూరు వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ సుధారాణి తెలిపారు. బుధవారం పట్టణ పరిధిలోని వ్యవసాయ పరిశోధన స్థానంలో కుసుమ పంటలో చీడపీడల నివారణకు డ్రోన్ ద్వారా మందు పిచికారీ చేసే విధానంపై రైతులకు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించారు. జిల్లాలోని పలు గ్రామాల నుంచి వచ్చిన రైతులు ఆసక్తిగా తిలకించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో శాస్త్రవేత్తలు మాట్లాడుతూ.. డ్రోన్ ద్వారా పురుగు మందు పిచికారీ చేయడంపై రెండేళ్ల పాటు పరిశోధన చేశామని, మంచి ఫలితాలు వచ్చాయన్నారు. రానున్న రోజుల్లో ఈ విధానం అందుబాటులోకి వస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డాక్టర్ సీ సుధాకర్, రాజేశ్వర్‌రెడ్డి, రైతు సలహా మండలి సభ్యుడు నారాయణ తదితరులు పాల్గొన్నారు.

బండి ఏదైనా బడికెళ్లడమే!

కేశంపేట: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు సరైన రవాణా సదుపాయాలు లేక తీవ్ర అవస్థలు పడుతున్నారు. కేశంపేట మండల పరిధిలోని అల్వాల గ్రామానికి చెందిన విద్యార్థులు నిత్యం రెండు కిలోమీటర్ల దూరంలోని కొత్తపేట ఉన్నత పాఠశాలకు వెళ్తుంటారు. వీరికి బస్సు సౌకర్యం లేకపోవడంతో ఏ వాహనం దొరికినా లిఫ్ట్ అడుగుతారు. ఈ క్రమంలో మంగళవారం జేసీబీ తొట్టిలో నిలబడి స్కూల్‌కు వెళ్లిన ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఇదిలా ఉండగా గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించాలని పలుమార్లు ఆందోళన చేసినా ఫలితం లేకుండాపోయిందని స్థానికులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.



జేసీబీలో వెళ్తున్న విద్యార్థులు

ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే ప్రసవాలు జరగాలి

- డీఎంహెచ్‌ఓ డాక్టర్ పాల్వన్‌కుమార్

పెద్దేముల్: ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే ప్రసవాలు జరగాలని, ఆ దిశగా వైద్యులు, సిబ్బంది చొరవ తీసుకోవాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ పాల్వన్‌కుమార్ సూచించారు. బుధవారం పెద్దేముల్ పీహెచ్‌సీని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. అనంతరం డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ.. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆస్పత్రి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని వైద్యుడు బుచ్చిబాబుకు సూచించారు. ఫిబ్రవరి నెల వైద్యసేవల్లో పెద్దేముల్ పీహెచ్‌సీ జిల్లాలో 5వ స్థానంలో నిలవడం సంతోషంగా ఉందన్నారు. అనంతరం కందనెల్లిలో నిర్వహిస్తున్న కంటి వెలుగు కార్యక్రమాన్ని పరిశీలించారు.



కంటి వెలుగు కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ పాల్వన్‌కుమార్

వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే



యువకుడిని ఆప్యాయంగా పలకరిస్తున్న రమేష్ మహరాజ్

- ఏఐసీసీ సభ్యుడు రమేష్ మహరాజ్
- తాండూరులో హాత్ సే హాత్ జోడో యాత్ర

తాండూరు: కేంద్రంలోనూ, రాష్ట్రంలోనూ అధికారంలోకి వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని ఏఐసీసీ సభ్యుడు, తాండూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ రమేష్ మహరాజ్ అన్నారు. బుధవారం ఆయన పట్టణంలో హాత్ సే హాత్ జోడో యాత్రను ప్రారంభించారు. మున్సిపల్ పరిధిలోని 2వ వార్డులో కౌన్సిలర్లు ప్రభాకర్ గౌడ్, వరాల శ్రీనివాస్‌రెడ్డి, మధుబాల, మమత, పార్టీ నాయకులతో కలిసి ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజలతో మమేకం అయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీ, బీఆర్ఎస్ ప్రభుత్వాలపై ప్రజలకు నమ్మకం పోయిందన్నారు. కాంగ్రెస్ పార్టీకి ప్రజల్లో ఆదరణ పెరిగిందన్నారు. తాండూరు ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేల ఆటలు ఇక సాగవన్నారు. అనంతరం ప్రజలకు రాహుల్‌గాంధీ సందేశాన్ని వివరించారు. కార్యక్రమంలో బషీరాబాద్ మాజీ జెడ్పీటీసీ రాకేష్ మహరాజ్, పీసీసీ ప్రధాన కార్యదర్శి ధారాసింగ్, పార్టీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు శోభారాణి, మున్సిపల్ మాజీ వైస్ చైర్‌పర్సన్ అలీం, మాజీ కౌన్సిలర్లు లిగదల్లి రవి, పీ బస్వరాజ్, చెన్‌మిల్ల మల్లికార్జున్, నాయకులు బీ శ్రీనివాస్, భీంశంకర్, నాగరాజ్, హేమంత్, కావలి సంతోష్, హబీబ్‌లాల, బలరాం తదితరులు పాల్గొన్నారు.

ఆట కదరా శివా..

- పెళ్లింట తీరని విషాదం
- ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆర్మీ జవాన్ మృతి
- చెల్లి పెళ్లి చూడకుండానే తుదిశ్వాస

షాద్‌నగర్: వివాహ ఆహ్వాన పత్రికలు పంచే క్రమంలో రోడ్డు ప్రమాదానికి గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆర్మీ జవాన్ శ్రీనివాస్ మృతిచెందారు. చెల్లెలి పెళ్లి జరిగిన రోజునే అన్న కన్నుమూయడంతో ఆ కుటుంబంలో తీరని విషాదం అలుముకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. ఫరూఖ్‌నగర్ మండలం కంసాన్‌పల్లికి చెందిన ఇప్పటూర్ సత్యమ్మ, సత్తయ్య దంపతులకు ముగ్గురు సంతానం. వీరిలో పెద్ద కొడుకు శ్రీనివాస్ (30) ఆర్మీ జవాన్‌గా జమ్మూకశ్మీర్‌లో విధులు నిర్వర్తిస్తున్నాడు. భార్య ప్రియాకంతో కలిసి తొమ్మిదేళ్లుగా అక్కడే ఉంటున్నాడు. చెల్లి వివాహం నిమిత్తం ఇటీవల భార్యతో పాటు స్వగ్రామానికి వచ్చాడు. బంధువులకు ఆహ్వాన పత్రికలు పంచే క్రమంలో పది రోజుల క్రితం మండల పరిధిలోని కమ్మదనం వద్ద బైక్ అదుపు తప్పి తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం అతన్ని గాంధీ ఆస్పత్రికి తరలించగా బుధవారం మృతిచెందాడు.



శ్రీనివాస్ మృతదేహానికి గౌరవ వందనం

ఓ వైపు వేడుక.. మరో వైపు విషాదం

శ్రీనివాస్ చెల్లెలు శిరీషకు వికారాబాద్ జిల్లా ధారూరు మండలం రాజాపూర్‌కు చెందిన గోవర్ధన్‌తో బుధవారం వివాహం జరిగింది. వరుడి స్వగ్రామంలో నిరాడంబరంగా వివాహం జరిపించారు. పెళ్లి తర్వాత శ్రీనివాస్ మరణ వార్త విన్న కుటుంబ సభ్యులు, బంధువులు బరువెక్కిన హృదయాలతో కంసాన్‌పల్లికి చేరుకుని అంత్యక్రియల్లో పాల్గొన్నారు. విషయం తెలుసుకుని గ్రామానికి చేరుకున్న ఆర్మీ ఆఫీసర్లు, సహచరులు గాలిలో కాల్పులు జరిపి, అధికారిక లాంఛనాలతో అంతిమ సంస్కారాలు పూర్తిచేశారు.



శ్రీనివాస్ (ఫైల్)


వాటా కోసం పోరుబాట

- భర్త ఆస్తిలో సగం వాటా ఇవ్వాలని డిమాండ్
- ఇంటి ఎదుట బైఠాయింపు

పరిగి: భర్త ఆస్తిలో తనకూ వాటా ఇవ్వాలంటూ 80ఏళ్ల వయస్సులో ఓ మహిళ పోరుబాట పట్టింది. ఈ ఘటన పరిగి పట్టణంలోని బాహార్‌పేట్ పరిసరాల్లో బుధవారం చోటుచేసుకుంది. స్థానికులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. పరిగి పట్టణానికి చెందిన రుక్మొద్దీన్‌కు ఇద్దరు భార్యలు. పెద్ద భార్య బద్రువున్నీసా(80) మహబూబ్‌నగర్ జిల్లా గండీడ్ మండలం మహమ్మదాబాద్‌లో నివాసం ఉంటోంది. చిన్న భార్య బిపాసా బేగం పరిగిలో ఉంటోంది. ఇద్దరికీ సంతానం లేదు. చిన్న భార్య అనాథ బాలున్ని దత్తత తీసుకుంది. యుక్త వయస్సు రాగానే బాలుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. 20 ఏళ్ల క్రితం భర్త కూడా చనిపోయాడు. ఆయన పేరున ఉన్న కోట్ల విలువ చేసే ఆస్తిని విక్రయించేందుకు చిన్న భార్య బిపాసాబేగం ప్రయత్నాలు మొదలుపెట్టింది. ఈ విషయం తెలుసుకున్న పెద్ద భార్య బద్రువున్నీసా పరిగి పట్టణానికి వచ్చి ఆస్తిలో తనకూ వాటా ఇవ్వాలంటూ భర్త ఇంటి ముందు బైఠాయించింది. అయితే నెలకు రూ. 5 వేలు ఇస్తానని, వృద్ధాశ్రమంలో చేర్పిస్తామని రెండో భార్య చెప్పింది. అంత్యక్రియల నిమిత్తం నీ పేరిట బ్యాంకులో కొంత డబ్బు జమ చేస్తామని చెప్పింది. ఇందుకు బద్రువున్నీసా ఒప్పుకోలేదు. భర్త ఆస్తిలో సగం వాటా ఇవ్వాల్సిందేనని తేల్చి చెప్పింది. గ్రామ పెద్దలు ఈ సమస్యను పరిష్కరించాలని వేడుకుంది. విషయం పెద్దది అవుతుందని భావించిన రెండో భార్య బిపాసాబేగం అక్కడి నుంచి నగరానికి వెళ్లిపోయింది. దీంతో ఏమీ చేసేది లేక బద్రువున్నీసా వెనుదిరిగింది.

నేటి నుంచి బసవేశ్వరుడి ఉత్సవాలు

కుల్కచర్ల: చౌడాపూర్ మండల పరిధిలోని కిష్టంపల్లిలో కోటచింతల బసవేశ్వర స్వామి దేవాలయ ఉత్సవాలు గురువారం నుంచి ప్రారంభం కానున్నాయని ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు చెప్పారు. మూడురోజుల పాటు జరిగే ఈ ఉత్సవాలలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆలయ పూజారీ మఠం సిద్దయ్య కోరారు.



కోటచింతల బసవేశ్వర స్వామి

మామిడి విక్రయాలు షురూ..

- బాటసింగారంలో తాత్కాలిక మార్కెట్ ప్రారంభం
- ముఖ్యఅతిథిగా హాజరైన మార్కెటింగ్ శాఖ అదనపు డైరెక్టర్ లక్ష్మణుడు

అబ్దుల్లాపూర్‌మెట్: బాటసింగారం తాత్కాలిక పండ్ల మార్కెట్‌లో బుధవారం క్రయవిక్రయాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి మార్కెటింగ్ శాఖ అదనపు డైరెక్టర్ ఆర్.లక్ష్మణుడు ముఖ్యఅతిథిగా హాజరై బీట్లు ప్రారంభించారు. మార్కెట్ ఆవరణలోని 18 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన షెడ్లలో తొలిరోజు సరుకు విక్రయించేందుకు రైతులు తరలివచ్చారు. గతేడాది మాదిరిగానే ఈ సంవత్సరం కూడా బాటసింగారంలోనే మామిడిని విక్రయించుకునేందుకు వీలుగా ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని మంచి ధర పొందాలని సూచించారు. అనంతరం మార్కెట్ ఆవరణలో కమీషన్‌దారులు, రైతులు, ఖరీదుదారుల సౌకర్యార్థం నూతనంగా ఏర్పాటు చేసిన బ్యాంక్ ఆఫ్ బరోడా బ్రాంచ్‌ను ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ ఆఫ్ బరోడా చీఫ్ జనరల్ మేనేజర్ మన్మోహన్‌గుప్తా, డివిజనల్ జోనల్ మేనేజర్ రాజశేఖర్, గోవింద్, సుధాకర్, టీవీవీఎస్ శర్మ, యశ్వంత్ భోపేష్, లాజిస్టిక్ పార్క్ ఎండీ మహేశ్‌గుప్తా, మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శి చిలక నర్సింహారెడ్డి, డీఈ రవీందర్‌లు పాల్గొన్నారు.



బాటసింగారంలో మామిడి విక్రయాలను ప్రారంభిస్తున్న లక్ష్మణుడు తదితరులు

క్లుప్తంగా

కిరాణ షాపులో చోరీ

మీర్‌పేట: కిరాణా షాపులో చోరీ జరిగిన సంఘటన మీర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. జిల్లెలగూడకు చెందిన గజపతి స్థానికంగా బాలాజీ కిరాణా షాపు నిర్వహిస్తున్నాడు. బుధవారం తెల్లవారు జామున ద్విచక్ర వాహనంపై వచ్చిన ఓ వ్యక్తి షాపు వెనుక భాగంలోని డోర్‌ను బద్దలు కొట్టి రూ. 30వేల విలువైన వస్తువులను ఎత్తుకెళ్లాడు. షాపు తెరిచేందుకు వచ్చిన యజమాని దొంగతనం జరిగినట్లు తెలుసుకుని వెంటనే పోలీసులకు సమాచారం అందించాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉపాధ్యాయురాలి అదృశ్యం


మాధురి(ఫైల్)

ఇబ్రహీంపట్నం రూరల్: పాఠశాలకు వెళ్తున్నానని చెప్పి వెళ్లిన ఓ ప్రైవేటు ఉపాధ్యాయురాలు అదృశ్యమైన సంఘటన ఆదిబట్ల పీఎస్ పరిధిలో బుధవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ లక్ష్మీనారాయణ తెలిపిన ప్రకారం.. తుక్కుగూడ మున్సిపాలిటీ రావిర్యాలకు చెందిన లింగం జయమ్మరాజు దంపతుల కూతురు మాధురి తుక్కుగూడలోని ఓ ప్రైవేటు పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పని చేస్తోంది. గత నెల 28న పాఠశాలకు వెళ్తున్నానని చెప్పి వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. ఫోన్ స్విచ్ఛాఫ్ రావడంతో బంధువులను వాకబు చేశారు. ఎక్కడ ఆచూకీ లభించకపోవడంతో బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

టీచర్స్ కాలనీలో ఓ వ్యక్తి..


లింగారెడ్డి(ఫైల్)

మీర్‌పేట్: ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఓ వ్యక్తి అదృశ్యమైన ఘటన మీర్‌పేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ మహేందర్‌రెడ్డి తెలిపిన ప్రకారం.. బాలాపూర్ మండలం గుర్రంగూడ గ్రామం, టీచర్స్ కాలనీకి చెందిన కాశిరెడ్డి లింగారెడ్డి(36) ఫిబ్రవరి 25న సాయంత్రం ఎవరికీ చెప్పకుండా తన బైక్‌పై ఇంటి నుండి బయలుదేరాడు. ఆయన మళ్లీ ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు బంధువులు, ఇరుగు పొరుగు ప్రాంతాల్లో వెతికారు. ఆచూకీ లభించకపోవడంతో భార్య ఉషారాణి బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సైంటిస్ట్ ఆత్మహత్య కేసు

విచారణ ముమ్మరం

ఇబ్రహీంపట్నం రూరల్: డీఆర్‌డీఓలో పనిచేస్తున్న సైంటిస్టు ఆత్మహత్య కేసుపై పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. స్నేహితులు నమ్మించి నట్టేట ముంచారని మనోవేదనకు గురై వనం రమేశ్ ఆత్మహత్యకు పాల్పడిన విషయం విదితమే. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు ఆదిబట్ల పోలీసులు కేసు విచారణప్రారంభించారు. నిందితులు వరప్రసాద్, రవికుమార్, సుందర్, రాజేశ్, అఫ్జల్‌పై కేసులు నమోదు చేసినట్లు ఎస్‌ఐ లక్ష్మీనారాయణ తెలిపారు. మైనింగ్, రియల్ ఎస్టేట్ వ్యాపారంలో పెట్టుబడిగా రూ.20 లక్షలు మాత్రమే ఒప్పందం చేసుకున్నట్లు పోలీసుల విచారణలో తేలింది. నిందితుల కోసం గాలిస్తున్నారు.

వైభవంగా వేణుగోపాలుడి బ్రహ్మోత్సవం

తలకొండపల్లి: కల్కిదోనగుట్ట గోపాలస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. బుధవారం ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఉదయం 11.30గంటల ప్రాంతంలో వేద పండితులు రుక్మిణి, సత్యభామ సమేత గోపాలస్వామి వారి కల్యాణం నిర్వహించారు. కల్యాణోత్సవానికి భక్తులు పెద్ద ఎత్తున హాజరై మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు ఇబ్బంది తలెత్తకుండా ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాటు చేశారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ ఉత్సవాల్లో ఆలయ ఫౌండర్, ట్రస్టు చైర్మన్ పట్టాభిరామశర్మ, ఆలయ కార్యనిర్వాహక సభ్యులు కృష్ణమూర్తి, పాండు రంగారెడ్డి, ఆమనగల్లు మార్కెట్ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, మాజీ ఎంపీపీ శ్రీనివాస్‌రెడ్డి, సర్పంచ్‌లు కిష్టమ్మ, ఎంపీటీసీ మాజీ సభ్యుడు యాదయ్య, స్వప్నారెడ్డి, వీరేశలింగం, జంగయ్య, ఏఎంసీ డైరెక్టర్ రమేశ్‌నాయక్. సింగిల్ విండో డైరెక్టర్ వెంకట్‌రెడ్డి, నాయకులు శ్యాంసేట్, రంగారెడ్డి, భాస్కర్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి, పాండు రెడ్డి, మల్లారెడ్డి పాల్గొన్నారు.


ప్రత్యేక పూజలు చేసిన ఎమ్మెల్యే, నేతలు

గోపాలస్వామి కల్యాణ వేడుకలకు ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, ఐక్యతా ఫౌండేషన్ ఎగ్జిక్యూటీవ్ సభ్యుడు వరప్రసాద్‌రెడ్డి పలువురు నేతలు హాజరయ్యారు. స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

వంతెన ఇంతేనా..?

మూడేళ్ల క్రితం చేపట్టిన వంతెన నిర్మాణం నేటికీ అసంపూర్తిగానే ఉంది. పనుల ప్రారంభోత్సవం సందర్భంగా ఏడాదిలో పూర్తిచేస్తామన్న అధికారులు అటుగా కన్నెత్తి చూడడంలేదు. దీంతో ప్రతీ వర్షాకాలం ప్రజలు పడే పాట్లు వర్ణనాతీతం.

- మూడేళ్లుగా కొనసాగుతున్న నిర్మాణ పనులు
- ఏటా ఇబ్బంది పడుతున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు


గాజీపూర్ వంతెన వద్ద రాకపోకలు ఇబ్బంది పడుతున్న ప్రజలు (ఫైల్)

పెద్దేముల్: తాండూరు–సంగారెడ్డి ప్రధాన రహదారిపై గాజీపూర్ వద్ద నిర్మిస్తున్న వంతెన పనులు మూడేళ్లుగా పెండింగ్‌లో ఉన్నాయి. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. వర్షాకాలం వచ్చిందంటే ఏ సమయంలో వాగు పొంగుతుందో.. రాకపోకలు నిలిచిపోతాయో తెలియక ఆందోళన చెందుతున్నారు. సంగారెడ్డి–తాండూరు ప్రధాన రహదారిపై రాకపోకలు పెరగడంతో 2016లో అప్పటి రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి మండల పరిధిలోని గాజీపూర్, బుద్దారం వంతెనల నిర్మాణానికి రూ.8.9కోట్ల నిధులు మంజూరు చేశారు. ఏడాదిలోగా పనులు పూర్తి చేయాలని సంబంధిత అధికారులు కాంట్రాక్టర్‌కు ఆదేశాలు జారీ చేశారు. మూడేళ్లైనా నేటికీ పనులు పూర్తికాలేదు. దీనికి తోడు ప్రభుత్వం బిల్లులు మంజూరు చేయక పోవడంతో సంబంధిత కాంట్రాక్టర్ సమయానికి పనులు పూర్తి చేయడం లేదనే ఆరోపణలున్నాయి. మూడేళ్లకు పైగా పనులు అర్ధాంతరంగా నిలిచిపోయినా ఎవరు పట్టించుకోవడం లేదు. ఈ విషయాన్ని సర్పంచ్, ఎంపీటీసీ సభ్యులు మండల సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డిలకు పలుమార్లు ఫిర్యాదులు చేసిన ఫలితం లేదనే పలువురు చర్చించుకుంటున్నారు.

పర్యవేక్షణ లోపం

వందల ఏళ్ల పాటు మన్నికగా ఉండాల్సిన వంతెన పనులు, అధికారుల పర్యవేక్షణ లేక కాంట్రాక్టర్ల ఇష్టారాజ్యంగా పనులు చేపట్టాడు. దీంతో వంతెనపై బీటలు వస్తున్నాయి. ఈ విషయాన్ని బుద్దారం, గాజీపూర్‌తో పాటు పలు గ్రామాల ప్రజలు ఉన్నతాధికారుల దష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదు. ముడేళ్లుగా భారీ వర్షాలు నమోదవ్వడంతో వాగులు పొంగి పొర్లుతున్నాయి. దీంతో ప్రయాణికులు నానా అవస్థలు పడ్డారు.

సమస్య పునరావృతం..?

రెండేళ్ల క్రితం భారీ వర్షాల వల్ల రాకపోకలు నిలచిపోయాయి. ఆ సమయంలో ఓ గర్భిణిని 108 అంబులెన్స్ సిబ్బంది స్ట్రెచర్‌పై వాగు దాటించారు. సుమారు మూడేళ్లుగా కాంట్రాక్టర్ పనులు ప్రారంభించక పోవటం, పాలకులు, ఆర్‌అండ్‌బీ అధికారులు పట్టించుకోకపోవడంతో ఈ ఏడాది మళ్లీ ఇదే సమస్య వస్తుందేమోనని రైతులు, ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రెండు నెలల క్రితం కాంట్రాక్టర్ పనులు ప్రారంభించినా మళ్లీ నిలిచిపోయాయి. జాతీయ రహదారికి ఈ మార్గం అనుసంధానంగా ఉండటంతో నిత్యం వందల సంఖ్యలో నాపరాతి, సుద్ద, సిమెంట్ లారీలు అధికంగా ప్రయాణిస్తున్నాయి. తాండూరు నుంచి సంగారెడ్డి, సదాశివపేట, మర్పల్లి, లింగంపల్లి, శంకర్‌పల్లికి వెళ్లే ప్రయాణికులు ఇదే మార్గం మీదుగా వెళ్తారు.

కొత్త కాంట్రాక్టర్‌కు అప్పగిస్తాం

పాత కాంట్రాక్టర్ పనులు చేపట్టడం లేదు. కొత్త కాంట్రాక్టర్‌కు పనులు అప్పగించాం. త్వరలో వంతెన పనులు పూర్తి చేస్తాం. ఈ ఏడాది ప్రయాణికులకు ఇబ్బందులు రాకుండా చూస్తాం. నాణ్యత ప్రమాణాలు పాటించేలా చర్యలు తీసుకుంటాం.

– శ్రీనివాస్, ఆర్‌అండ్‌బీ డీఈఈ, తాండూరు

ధర తగ్గించకుంటే ఉద్యమిస్తాం

సిలిండర్ ధర పెంపుపై ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి ఆగ్రహం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి

పరిగి: కేంద్ర ప్రభుత్వం పెంచిన గ్యాస్ ధరలను తగ్గించకుంటే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని పరిగి ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి హెచ్చరించారు. గ్యాస్ ధరల పెంపుపై బుధవారం ఆయన నివాసంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కేంద్రం గ్యాస్ ధరలను విపరీతంగా పెంచుతూ.. పేదలను దోచుకుంటుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు కొమ్ము కాస్తూ పేదలకు అన్యాయం చేస్తోందని ఆరోపించారు. పేదలకు అందాల్సిన కార్పొరేట్ సంస్థల చేసిన వేల కోట్ల రుణాలు మాఫీ చేయడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. ఇప్పటికే ఉన్న ధరతో ప్రజలు ఇబ్బంది పడుతుంటే మరో రూ.50 పెంచి సామాన్యుల నడ్డి విరుస్తోందన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం మాత్రమే నిరంతరం పేదల సంక్షేమానికి కృషి చేస్తుందన్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రజలు బీజేపీకి బుద్ధి చెప్పి బీఆర్‌ఎస్‌కు పట్టం కడతారన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ శ్యాంసుందర్‌రెడ్డి, వైస్ చైర్మన్ భాస్కర్, పార్టీ మండల అధ్యక్షుడు ఆంజనేయులు, మార్కెట్ కమిటీ చైర్మన్ సురేందర్, సీనియర్ నాయకుడు ప్రవీణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైతుకు విద్యుదాఘాతం

తీవ్ర గాయాలు.. హైదరాబాద్‌కు తరలింపు


చికిత్స పొందుతున్న మురళీధర్‌రెడ్డి

పరిగి: ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతు చేస్తుండగా విద్యుదాఘాతానికి గురై ఓ రైతు తీవ్రంగా గాయపడ్డాడు. ఈ సంఘటన మండల పరిధిలోని గడిసింగాపూర్‌లో బుధవారం చోటుచేసుకుంది. వివరాలు.. గ్రామానికి చెందిన మురళీధర్‌రెడ్డి పొలం సమీపంలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ మూడు రోజులుగా మరమ్మతుకు నోచుకుంది. రైతులు అధికారులకు సమాచారం అందించినా పట్టించుకోలేరు. దీంతో విద్యుత్ సమస్యతో పంటలు ఎండి పోతుండటంతో మురళీధర్‌రెడ్డి, పక్క పొలం రైతు నీల్యానాయక్‌తో కలసి ట్రాన్స్‌ఫార్మర్ దగ్గరకు వెళ్లి పరిశీలిస్తున్నాడు. ఈ క్రమంలో మురళీధర్‌రెడ్డి విద్యుదాఘాతానికి గురయ్యాడు. వెంటనే రైతులు చికిత్స నిమిత్తం పరిగి ప్రభుత్వ ఆస్పత్రికి, అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ తరలించారు. ప్రమాదానికి విద్యుత్ అధికారుల నిర్లక్ష్యమేనని రైతులు ఆరోపించారు. మూడు రోజులుగా రైతులు ఎంత మొరపెట్టుకున్నా కనీసం పరిశీలించకుండా నిర్లక్ష్యంగా వ్యవహించారని వారు వాపోయారు. విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న విద్యుత్ అధికారులపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

వివాహేతర సంబంధమే హత్యకు కారణం

- సీఐ శ్రీధర్ కుమార్ వెల్లడి
- నిందితుడి రిమాండ్


నిందితుడు రాజు

శంషాబాద్ రూరల్: వివాహేతర సంబంధం ఓ మహిళ హత్యకు దారి తీసింది. తనతో గడిపితే డబ్బులు ఇస్తానని మోసం చేసిన వ్యక్తి ఆమె మెడకు చీర బిగించి హత్య చేశాడు. వారం కిందట మల్కారం సమీపంలో జరిగిన మహిళ హత్య కేసును ఛేదించిన పోలీసులు నిందితుడిని బుధవారం రిమాండ్‌కు తరలించారు. ఇన్‌స్పెక్టర్ ఎ.శ్రీధర్‌కుమార్ తెలిపిన వివరాల మేరకు.. మండల పరిధిలోని రామంజాపూర్ గ్రామానికి చెందిన నార్ల పద్మమ్మ(45) భర్త గతంలో చనిపోయాడు. అదే గ్రామానికి చెందిన కత్తుల రాజు(35)తో ఉన్న పరిచయం వారిద్దరి మధ్య వివాహేతర సంబంధానికి దారితీసింది. ఆరు నెలల కిందట డబ్బులు ఇస్తానని ఆమెను లొంగదీసుకున్న ఇతను తర్వాత మాట మార్చడంతో ఇద్దరి మధ్య గొడవ జరిగి కొన్నాళ్లు మాట్లాడుకోలేదు. ఫిబ్రవరి 19న రాత్రి పద్మమ్మ అతడికి ఫోన్ చేసి డబ్బులు అడిగింది. బయటకు వస్తే ఇస్తానని చెప్పాడు. దీంతో రాత్రి ఏడున్నర గంటల సమయంలో పద్మమ్మను తన బైక్‌పై మల్కారం శివారుకు తీసుకెళ్లాడు. డబ్బుల విషయంలో ఇద్దరి మధ్య గొడవ జరగడంతో పద్మమ్మను చీరతో మెడకు బిగించి హత్య చేశాడు. ఫిబ్రవరి 23న మల్కారం శివారులో పద్మమ్మ మృతదేహం లభించింది. మృతదేహం వద్ద దొరికిన సెల్‌ఫోన్, సమీపంలోని సీసీటీవీ ఫుటేజీ ఆధారంగా పోలీసులు దర్యాప్తు చేపట్టారు. అనుమానంతో రాజును అదుపులోకి తీసుకుని విచారించగా పద్మమ్మను హత్య చేసినట్లు ఒప్పుకున్నాడు.

అంగన్‌వాడీల సమ్మె

సమస్యలు పరిష్కరించాలని కార్మికుల డిమాండ్


వికారాబాద్‌లోని ఐసీడీఎస్ సీడీపీఓ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న అంగన్‌వాడీలు

అనంతగిరి: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అంగన్‌వాడీ టీచర్స్‌హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో సీడీపీఓ కార్యాలయం ఎదుట కార్మికులు సమ్మె చేస్తున్నారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మైపాల్ మాట్లాడుతూ అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, వెంటనే ప్రమోషన్‌లు ఇవ్వాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ రూ.10లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న టీఏ, డీఏలు ఇవ్వాలన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలను పెంచాలని కోరారు. మినీ అంగన్‌వాడీలను మెయిన్ అంగన్‌వాడీలుగా గుర్తించాలన్నారు. ఈఎస్‌ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలన్నారు. కనీస వేతనాలు రూ.26వేలు ఇవ్వాలన్నారు. అలాగే.. అంగన్‌వాడీ సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరారు. గురు, శుక్రవారాల్లో కలెక్టర్ కార్యాలయం ముందు 24 గంటల సమ్మె చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా కార్యదర్శి భారతి, నాయకులు వనజ, భాగ్యమ్మ, ప్రమీల, లక్ష్మి, అండాలు, సుజాత, నాగమణి, అన్నపూర్ణ, ప్రమీల, శారద, దేవి, బుజ్జమ్మ, కళావతి, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలు నిర్వహిస్తాం

ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి


బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు యాదయ్య, నరేందర్‌రెడ్డి

షాబాద్: పీఆర్‌ఆర్ మినీ స్టేడియంలో రాష్ట్ర, జాతీయ స్థాయి క్రికెట్, వాలీబాల్ పోటీలు నిర్వహించేందుకు కృషి చేస్తామని ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు కాలె యాదయ్య, పట్నం నరేందర్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని గొల్లూరుగూడలో పట్నం రాజేందర్‌రెడ్డి వర్ధంతి సందర్భంగా వారం రోజులుగా జిల్లా స్థాయి, క్రికెట్, వాలీబాల్, క్యారమ్స్ పోటీలు నిర్వహించారు. ఇందులో విజేతలకు బుధవారం వారు జెడ్పీటీసీ సభ్యుడు పట్నం అవినాశ్‌రెడ్డి, ఎంపీపీ ప్రశాంతితో కలిసి బహుమతులు అందజేశారు. క్రికెట్ పోటీల్లో నాగర్‌గూడకు చెందిన మన్సూర్ జట్టుకు మొదటి బహుమతిగా రూ.లక్ష నగదు, మెమొంటో, షాబాద్ జట్టుకు ద్వితీయ బహుమతిగా రూ.75వేల నగదు, మెమొంటో అందజేశారు. వాలీబాల్ పోటీల్లో కంకల్ జట్టుకు ప్రథమ బహుమతిగా రూ.25వేల నగదు, మెమొంటో, ద్వితీయ బహుమతిగా కక్కులూరు జట్టుకు రూ.15వేల నగదు, మెమొంటో అందజేశారు. క్యారమ్స్‌లో తౌసిఫ్, ఇమ్రాన్‌లకు నగదు బహుమతి, మెమొంటోలు అందజేసి సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. యువత చదువుతో పాటు క్రీడల్లలోనూ రాణించాలని సూచించారు. చేవెళ్ల ప్రాంత చైతన్యానికి సొంత ఖర్చులతో పోటీలు నిర్వహించి ప్రోత్సహించే వారని గుర్తుచేశారు. షాబాద్ మండలాభివృద్ధికి చర్యలు తీసుకుంటామన్నారు. ఇప్పటికే వెల్‌స్పన్, అమేజాన్ వంటి బడా కంపెనీలు రావడంతో షాబాద్‌కు ప్రపంచంలో గుర్తింపు వచ్చిందన్నారు. త్వరలో సీతారాంపూర్‌లో ఎలక్ట్రిక్ వాహనాల తయారీ పరిశ్రమ ఏర్పాటుకు పనులు ముమ్మరంగా సాగుతున్నాయని చెప్పారు. చేవెళ్ల నియోజకవర్గానికి రూ.25కోట్ల నిధులు మంజూరు చేసిన ఘనత తెలంగాణ ప్రభుత్వానికే దక్కిందన్నారు. శంషాబాద్ నుంచి నాగర్‌గూడ వరకు రూ.200కోట్లతో నాలుగు లైన్ల రోడ్లుకు నిధులు మంజూరయ్యాయని వివరించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ నర్సింగ్‌రావు, సహకార సంఘం చైర్మన్ శేఖర్‌రెడ్డి, రంగారెడ్డి జిల్లా లీగల్ అడ్వైజర్ పీసరి సతీశ్‌రెడ్డి, టీఆర్‌ఎస్ నాయకులు శ్రీనివాస్‌గౌడ్, రాజేందర్‌గౌడ్, ప్రభాకర్‌రెడ్డి, మధుసూదన్ రెడ్డి, వెంకటయ్య, కృష్ణారెడ్డి, శ్రీరాంరెడ్డి, ఇమ్రాన్, ముఖ్రంఖాన్, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

మొక్కల సంరక్షణకు చర్యలు చేపట్టండి


బస్వాపూర్ పల్లె ప్రకృతి వనాన్ని పరిశీలిస్తున్న జానకీరెడ్డి తదితరులు

జెడ్పీ సీఈఓ జానకీరెడ్డి

బంట్వారం: హరిత హారంలో నాటిన మొక్కలు వేసవిలో ఎండకుండా సంరక్షణ చర్యలు చేపట్టాలని జెడ్పీ సీఈఓ జానకీరెడ్డి అధికారులకు సూచించారు. బుధవారం ఆయన మండల పరిధిలోని తొర్మామిడి, బస్వాపూర్ గ్రామాలను సందర్శించి పలు అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాతూ.. ఎవెన్యూ ప్లాంటేషన్‌కు సంబంధించి సాసరింగ్ పనులు వెంటనే పూర్తి చేయాలన్నారు. మొక్కల దగ్గర గడ్డిని తొలగించాలన్నారు. ప్లాస్టిక్ వ్యర్థాలు ఉంటే ఏరివేయాలని చెప్పారు. మొక్కలకు క్రమం తప్పకుండా నీరు పట్టాలని అధికారులకు సూచించారు. గ్రామాలు పరిశుభ్రంగా ఉండేలా ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య పనులు చేపట్టాలన్నారు. నర్సరీల్లో మొక్కల ఎదుగుదలకు చర్యలు తీసుకోవాలన్నారు. కన్వర్షన్ పనులు మిగిలి ఉంటే సత్వరమే పూర్తి చేయాలని చెప్పారు. అనంతరం ఆయన మండల పరిషత్ కార్యాలంలో అధికారులతో సమావేశమై పలు అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఈఓ సుభాషిణి, ఎంపీడీఓ బాలయ్య, ఎంపీఓ విజయ్‌కుమార్, సూపరిండెంట్ షిండే, జేఏ షఫీ, ఏపీఓ సుధాకర్, తొర్మామిడి, బస్వాపూర్ సర్పంచ్‌లు స్ఫూర్తి, నర్సింలు, ఎఫ్ఏ ఏసురత్నం తదితరులు పాల్గొన్నారు.

నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

ఆలూరు వైద్య సిబ్బందిపై డిప్యూటీ డీఎంహెచ్‌ఓ ఆగ్రహం

చేవెళ్ల: ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రజలకు సరైన వైద్యసేవలు అందించాలని, విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పనవి డిప్యూటీ డీఎంహెచ్‌ఓ దామోదర్ అన్నారు. మండల పరిధిలోని ఆలూరు ఆస్పత్రిలో మంగళవారం వైద్యుల దుమ్మాపై గ్రామస్తుల ఆగ్రహం వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. ఈ కథనానికి స్పందించిన డిప్యూటీ డీఎంహెచ్‌ఓ దామోదర్.. బుధవారం ఆలూరు ఆస్పత్రిని తనిఖీ చేశారు. వైద్యులు, సిబ్బందితో సమావేశమయ్యారు. మంగళవారం సాయంత్రం ఆస్పత్రిలో ఎవరూ విధుల్లో ఉండకపోవటానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. గాయపడిన వారిని ఆస్పత్రికి తీసుకొస్తే పారామెడికల్ సిబ్బంది అందుబాటులో ఉండకపోవడం ఏమిటని ప్రశ్నించారు. అప్పటి వరకు డ్యూటీలో ఉన్న వారు రిలీవర్ వచ్చే వరకు విధుల్లోనే ఉండాలనే విషయం తెలియదా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. కచ్చితంగా వెళ్లాల్సి వస్తే ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు. ప్రజలకు అసౌకర్యం కలిగించినందుకు గాను ఆలూరు ఆస్పత్రి వైద్యులు డాక్టర్ రఘుబాబుకు, ముగ్గురు స్టాఫ్ నర్సులు, ఫార్మాసిస్టులకు సంజాయిషీ ఇవ్వాలని నోటీసులు జారీ చేశారు. మరోసారి ఇలాంటి ఘటనలు జరిగితే సహించేది లేదన్నారు. ప్రజలకు ఎప్పుడు అందుబాటులో ఉండి వైద్యసేవలు అందించాలని సూచించారు. సమావేశంలో సీహెచ్‌ఎస్ గోపాల్‌రెడ్డి, హెల్త్ ఎడ్యుకేటర్ సుదర్శన్, ఆలూరు ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది ఉన్నారు.

డ్యూటీకని చెప్పి సొంతూరుకు..

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

చేవెళ్ల: బైక్‌పై నుంచి కిందపడి తీవ్రంగా గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. ఈ సంఘటన చేవెళ్ల పోలీస్‌స్టేషన్ పరిదిలోని మీర్జాగూడ బస్‌స్టేజీ సమీపంలో మంగళవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. ఎస్‌ఐ హయ్యూమ్ కథనం ప్రకారం.. కర్నాటక రాష్ట్రం మొదీన గ్రామానికి చెందిన శానప్ప కుటుంబం బతుకు దెరువు కోసం హైదరాబాద్ ఫిలింనగర్‌లో నివాసం ఉంటోంది. శానప్ప కుమారుడు గొర్ల నవీన్(21) సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నాడు. మంగళవారం ఉదయం డ్యూటీకి వెళ్తున్నానని ఇంట్లో చెప్పి వెళ్లాడు. కానీ పనికి వెళ్లకుండా స్వగ్రామం కర్నాటకు బైక్‌పై వెళుతుండగా.. చేవెళ్ల మండలం మీర్జాగూడ బస్‌స్టేజీ వద్ద అర్ధరాత్రి రోడ్డుపై కిందపడిపోయాడు. సమాచారం అందుకున్న పోలీసులు.. ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించగా అతని తలకు, శరీర భాగాలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే అతన్ని చేవెళ్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స నిర్వహించి మెరుగైన వైద్యకోసం నగరంలోని ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందినట్లు ఎస్‌ఐ తెలిపారు. కేసు దర్యాప్తులో ఉంది.

దాడులు చేయడం చట్ట వ్యతిరేకం

రంగారెడ్డి జిల్లా డీసీసీ అధ్యక్షుడు నర్సింహారెడ్డి


మీర్‌పేట: సీఎం కేసీఆర్, కేటీఆర్‌ల దిష్టి బొమ్మలను దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

మీర్‌పేట: భౌతిక దాడులకు పాల్పడుతూ సభలను అడ్డుకోవడం చట్ట వ్యతిరేకమైన చర్య అని రంగారెడ్డి జిల్లా డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి అన్నారు. భూపాలపల్లిలో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి సభపై బీఆర్‌ఎస్ నాయకులు రాళ్లు, గుడ్లు విసిరి సభను అడ్డుకోవడాన్ని ఖండిస్తూ బుధవారం మీర్‌పేట మందమల్లమ్మ చౌరస్తాలో సీఎం కేసీఆర్, కేటీఆర్‌ల దిష్టిబొమ్మలను దహనం చేశారు. ఈ సందర్భంగా నర్సింహారెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో బీఆర్‌ఎస్ అధికార దుర్వినియోగానికి పాల్పడుతూ దౌర్జన్యాలు, అక్రమాలు, దాడులకు పాల్పడుతోందని ఆరోపించారు. పోలీసులు అధికార పార్టీకి తొత్తులుగా వ్యవహరిస్తున్నారని అన్నారు. కేసీఆర్ పాలనకు ప్రజలు త్వరలోనే చరమగీతం పాడతారన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ మాజీ ఫ్లోర్ లీడర్ ఏనుగు జంగారెడ్డి, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేశ్‌గౌడ్, నాయకులు యాదిరెడ్డి, యూత్ కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, సుభాశ్‌రెడ్డి, శేఖర్ రెడ్డి, మురళిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

దాడి అప్రజాస్వామికం: శ్రీనివాస్‌రెడ్డి

కడ్తాల్: టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి పాదయాత్రకు ప్రజల నుంచి వస్తున్న స్పందన చూసి ఓర్వలేక బీఆర్‌ఎస్ నాయకులు దాడులకు పాల్పడుతున్నారని డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులతో కలిసి ఆయన మాట్లాడారు. హాత్ సే హాత్ జోడో యాత్రలో భాగంగా మంగళవారం భూపాలపల్లి జిల్లా కేంద్రంలో రేవంత్‌రెడ్డి ప్రసంగిస్తున్న సమయంలో బీఆర్‌ఎస్ నాయకులు దొంగ చాటుగా దాడులు చేయడం సిగ్గుచేటని విమర్శించారు. దాడులకు కాంగ్రెస్ పార్టీ భయపడదని.. ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడితే సహించేది లేదని హెచ్చరించారు. పార్టీ కార్యకర్తల కష్టంతో చేతి గుర్తుపై గెలిచిన భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణరెడ్డి అధికార దాహంతో, డబ్బుకు ఆశపడి బీఆర్‌ఎస్‌లో చేరి ఈ రోజు దాడులకు ప్రేరేపించడం సరికాదన్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రజామద్దతుతో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు యాట నర్సింహ, సింగిల్‌విండో డైరెక్టర్ చేగూరి వెంకటేశ్, కోఆప్షన్ సభ్యుడు జహంగీర్‌బాబా, సర్పంచ్ పాండునాయక్, నాయకులు బీచ్యానాయక్, లక్ష్మయ్య, మల్ల య్య, మల్లేశ్‌గౌడ్, శ్రీను, రాజేశ్, భానుకిరణ్, మహే శ్, శ్రీశైలం, శ్రీకాంత్, జంగయ్య తదితరులున్నారు.